క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



దర్గాలో ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. మొహర్రం పండుగ ముగిసి 40 రోజులు పూర్తి కాగా మొదటి శుభవారం కావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతోపాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా భక్తులతో నిండిపోయింది. స్వామివారికి పూలదట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అవుకు(కొలిమిగుండ్ల): ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మూడో విడతలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. కంప్యూటర్, వెల్డర్ ఏడాది కోర్సు, డ్రాఫ్టమెన్ సివి ల్, ఎలక్ట్రానిక్ మెకానిక్ రెండేళ్ల కోర్సులు ఉన్నాయన్నారు. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని iti.ap gov.in, వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు 29వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: జలదుర్గం సబ్‌స్టేషన్ పరిధిలోని గోపాలనగరం గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలనగరంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

డోన్‌లో ఐదు గంటలు

డోన్ టౌన్: డోన్–బేతంచెర్ల జాతీయ రహదారి నిర్మాణ పనుల కారణంగా యూ.కొత్తపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని డిగ్రీ కళాశాల 11 కేవీ లైన్ మార్పు పనులు చేపట్టనున్నట్లు ఏఈ నాగేశ్వర రెడ్డి తెలిపారు. ఈ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ ఆసుపత్రి, డిగ్రీ కాలేజ్, వ్యవసాయ మార్కెట్ యార్డు, జూనియర్ కళాశాల, రైల్వే స్టేషన్‌తో పాటు దొరపల్లె ఇండస్ట్రియల్ ఫ్యాక్టరీల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రెండు రోజుల పాటు కరెంటు నిలిపివేత

మల్యాల సబ్ స్టేషన్ పరిధిలోని యాపదిన్నె ఫీడర్ కింద 11 కేవీ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో యాపదిన్నె, ఎద్దుపెంట, తాడూరు గ్రామాలకు శుక్ర,శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు రెండు రోజులు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని వివరించారు.

అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి



సర్పంచ్‌ను సన్మానిస్తున్న కాలనీవాసులు

బేతంచెర్ల: గ్రామంలోని ప్రజలు, అధికారుల సహకారంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం అవుతుందని గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో మహిళల సౌకర్యార్థం రూ.8 లక్షలతో నిర్మించిన వెట్ లెట్రిన్‌ను సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు రామనాథం, వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. సర్పంచ్‌ను కాలనీవాసులు సన్మానించారు.

వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత



వృద్ధులను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: సమాజంలోని వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని టీచర్ కిరణ్మయి పేర్కొన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం హోసన్నా వృద్ధాశ్రమంలో వృద్ధులకు శాలువాలు కప్పి,వస్త్రాలుఅందజేశా రు. ఆశ్రమనిర్వాహకుడు జాన్‌ప్రభాకర్ పాల్గొన్నారు.

స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో.. స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపకుడు ఆలా మధు ఆధ్వర్యంలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్ అధినేత సాయినాథ్, గంగన్న, మున్సిపల్ ఉద్యోగి ఆదినారాయణ ఆర్థిక సహకారంతో రైల్వే స్టేషన్ ప్రాంతంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

అడుగంటుతున్న ఆశలు

- చుక్కనీరులేని గుండం మల్లికార్జున స్వామి ఊట చెరువు
- అడుగంటిన భూగర్భ జలాలు
- ఎండిపోతున్న వ్యవసాయబోర్లు
- ఆందోళనలో అన్నదాతలు



చిన్నరాజుపాలెంతండా సమీపంలో నీరులేని వ్యవసాయబోరు



చుక్కనీరులేని గుండం మల్లికార్జునస్వామి ఊట చెరువు

బనగానపల్లె: మండలంలోని పసుపల గ్రామంలో ఉన్న గుండం మల్లికార్జునస్వామి ఊట చెరువు ఈసారి కురిసిన తక్కువ వర్షాల వల్ల చుక్కనీరు లేక ఎండిపోయింది. దాంతో సమీప గ్రామాలైన పసుపల, పసుపలతండా, చిన్నరాజుపాళెం, చిన్న రాజుపాళెం తండా, కాలేనాయక్‌తండా తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటిపోయాయి.

బోర్ల పరిస్థితి దారుణం

పసుపల సబ్‌స్టేషన్ పరిధిలో సుమారు 1,600 వ్యవసాయ బోర్లు ఉండగా, వీటి ఆధారంగా 7–8 వేల ఎకరాల్లో సాగు జరుగుతుంది. అయితే చెరువులు ఎండిపోవడంతో 70–80 శాతం బోర్లలో పూర్తిగా నీరు ఎండిపోగా, మిగిలిన బోర్లలో కూడా కొద్దిపాటి నీరే వస్తోందని రైతులు వాపోతున్నారు.

పంటలు వర్షాల కోసం ఎదురుచూపు

ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు విస్తారంగా మొక్కజొన్న, కంది, పత్తి పంటలు సాగు చేయగా, మరికొన్ని భూములు బీడుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు ఇటీవల పడిన చినుకుల వల్ల కొంత వరకు ఆశాజనకంగా ఉన్నా, వర్షాలు లేకపోతే దిగుబడి లభించదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల వేదన

గత ఏడాది చెరువులో నీరు ఉండడంతో బోర్లలోనూ తగినంత నీరు లభించి మంచి పంటలు పండాయి. ఈసారి చెరువులో నీరు చేరకపోతే ఉన్న బోర్లూ ఎండిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ బోర్లలో నీరులేదు



నాకు మొత్తం 3 వ్యవసాయబోర్లు ఉన్నాయి. బోర్ల ఆధారంగా 13 ఎకరాల్లో పంటు సాగు చేస్తుంటాను. ప్రస్తుతం మొక్కజొన్న, కంది పంటలు సాగు చేశాను. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా లేనందున చెరువులో నీరులేదు. వంకలు, వాగుల్లో నీటి ప్రవాహం లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. వ్యవసాయ బోర్లలో నీరు లేదు. బోర్ల కింద సాగులో ఉన్న భూమి వర్షాధారంగా మారింది.

–సోమ్లానాయక్, రైతు, కాలేనాయక్ తండా

అడుగంటిన భూగర్భజలాలు



మాకు 4 ఎకరాల వ్యవసాయ భూమి.. బోరు ఉంది. ఈ సంవత్సరం అవసరమైన మేర వర్షపాతం నమోదు కాకపోవడంతో గుండం మల్లికార్జున చెరువులో నీరు చేరలేదు. భూగర్భ జలాలు అడగంటి బోరులో నీరులేకుండాపోయింది. బోరు ఆధారంగా మొక్కజొన్న పంటను సాగు చేశాను. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

–శ్రీరామ్ నాయక్, రైతు, కాలేనాయక్ తండా

శిథిలావస్థలో పశువైద్యశాల



శిథిలావస్థకు చేరుకున్న యాగంటిపల్లె పశువైద్యశాల



మందులు వర్షపునీటితో తడవకుండా కప్పిన ప్లాస్టిక్ సంచులు

- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- చిన్నపాటి వర్షానికే తడుస్తున్న మందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పెచ్చు లూడిన పైకప్పు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. పశువైద్య సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 1982లో పాడి సంపదను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ఈ వైద్యశాలకు దాదాపు 43 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రస్తుతం ఈ కేంద్రం పరిధిలో యాగంటిపల్లెతో పాటు మీరాపురం, మాదనుపల్లె, సాదుకొట్టం, పాతపాడు, కటికవానికుంట, ఫతేనగర్, రాళ్ల కొత్తూరు, రాళ్లకొత్తూరుతాండా, తమ్మడపల్లె, నిలువ గండ్ల, జమ్ములదిన్నె గ్రామాల పశువులకు చికిత్స అందించాల్సి ఉంది. తమ్మడపల్లె గ్రామపంచాయతీలో ఒక సబ్‌సెంటర్ ఏర్పాటు చేసినప్పటికీ ప్రధాన కేంద్రం యాగంటిపల్లెగానే ఉంది. అయితే ఇక్కడ వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండటంతో అవుట్‌సోర్సింగ్ అటెండర్‌తోనే పనిచేస్తోంది. ఈ భవనం రోడ్డుకు సుమారు 3 అడుగుత తగ్గులో ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో వైద్యశాలలో నీరు చేరిపోతోంది. మందులు, పరికరాలు తడవకుండా ప్లాస్టిక్ సంచులతో కాపాడుకోవాల్సి వస్తోంది. పైకప్పు పెచ్చులు ఊడిపడుతుండడంతో వైద్యులు, సిబ్బంది భయాందోళనతో విధులు నిర్వర్తిస్తున్నారు. గేట్ లేకపోవడం, ఆవరణం అపరిశుభ్రంగా మారడం వల్ల పశువులకు చికిత్స అందించడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త పశువైద్యశాలను నిర్మించాలని పాడిరైతులు కోరుతున్నారు. ఈ విషయంపై పశువైద్యాధికారి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. భవనం శిథిలావస్థకు చేరుకుని ఇబ్బందులు ఎదురవుతున్న విషయం వాస్తవమేనన్నారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.



గేటు లేని దృశ్యం

భక్తిశ్రద్ధలతో గోపాలుడి గ్రామోత్సవం



శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని శ్రీకృష్ణుడి విగ్రహంతో గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎల్‌వీ సినిమా థియేటర్ సమీపంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి చివరి రోజు విగ్రహాన్ని పట్టణంలోని పురవీధుల మీదుగా ఊరేగించారు. ముదిగేడు చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, గ్రామ పంచాయతీ సర్కిల్, జమ్మలమడుగు చౌరస్తా మీదుగా ఊరేగింపు కొనసాగింది. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



ప్యాపిలిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రమణీయం.. కన్నయ్య గ్రామోత్సవం

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం వైభవంగా ముగిశాయి. శ్రీకృష్ణాష్టమి పర్వదినమైన ఆగస్టు 16న గ్రామంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఏర్పాటు చేశారు. ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో భాగంగా గ్రామ పురవీధుల మీదుగా శ్రీకృష్ణుని ప్రతిమకు గ్రామోత్సవం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు రామకృష్ణ, విశ్వనాథ్, పుల్లయ్య, జమాల్ బాషా, ఆవాజ్ కమిటీ నాయకులు రసూల్, గ్రామపెద్దలు తిరుపాల్ నాయుడు, జయన్న పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె: యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం ఏకశిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరులకు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామానికి చెందిన ఓ మహిళపై అదనపు కట్నం కోసం వేధింపులు జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలు బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాల ప్రకారం .. గూటుపల్లెకు చెందిన నన్నూర్ లత అనే మహిళను ఏడాదిన్నర క్రితం మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన శశికుమార్‌తో వివాహం చేశారు. అయితే ఇటీవల భర్త శశికుమార్‌తో పాటు అత్త రత్నమ్మ, మామ నాగయ్యలు అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్నారని లత ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొలిమిగుండ్ల: తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. మోడల్ స్కూల్ సమీపంలోని కాలనీలో ఉండే భాస్కర్ పిల్లలను బైక్‌పై ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో వదిలిపెట్టి ఇంటికి బయలు దేరాడు. తహసీల్దార్ కార్యాలయం సమీపానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న బొలెరో జీపు ఢీకొనడంతో కింద పడి గాయపడ్డాడు. స్థానికులు చికిత్స కోసం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చర్చి మరమ్మతులకు విరాళం

డోన్ టౌన్: కొత్త బస్టాండ్ సమీపంలోని డేవిడ్‌నగర్ తెలుగు బాప్టిస్ట్ చర్చి మరమ్మతుల నిమిత్తం రాయలసీమ వర్క్ అండ్ ప్రేయర్ ఫెలోషిప్ తరఫున బ్రదర్ ధర్మవీర్‌పాల్ దంపతులు, బ్రదర్ కిరణ్‌కుమార్‌కు రూ.15 వేలు విరాళాన్ని అందజేశారు. బైబిల్ మిషన్ ఏఓ బందెల రాజు, ఆదాం, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ 3వ విడత ప్రవేశాలు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ప్రభుత్వ ఐటీఐలో 3వ విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ఈనెల 26వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న సర్టిఫికెట్ల పరిశీలన, 29న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

కుక్కలకు రేబిస్ టీకాలు



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ బాలాంజనేయులు

బనగానపల్లె రూరల్: పట్టణంలో వీధికుక్కలకు రేబిస్ టీకాలు వేసి, వాటిని నిర్మాణ ప్రదేశాలకు తరలించే చర్యలు చేపడుతున్నట్లు మండల డిప్యూటీ ఎంపీడీఓ బాలాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో ఏడీఈ డాక్టర్ మారతిసకారామ్ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బందికి వీధి కుక్కలకు రేబిస్ టీకాలు వేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీధికుక్కల కారణంగా పట్టణ ప్రజలు, ముఖ్యంగా చిన్నపిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీటిని నిర్మాణ ప్రదేశాలకు తరలించే చర్యలు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు బ్రహ్మానందరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామ్‌కుమార్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, గ్రామ పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేద గర్భిణులకు సీమంతం

డోన్: స్థానిక ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిరుపేద గర్భిణులకు సీమంతం వేడుకను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో 13 మంది గర్భిణులకు చీరలు, సారెలు, పండ్లు, పూలు, పసుపు, కుంకుమలతో ఒడినింపి సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు శకుంతలారెడ్డి, కార్యదర్శి విజయలక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి సభ్యులు మశ్రి సరళాదేవి, సూర్యకుమారి, మద్దమ్మ, మంజుల ఆర్థిక సహకారం అందించారు. ఏర్పాట్లలో వ్యవస్థాపక అధ్యక్షురాలు రాజా సుజాతతో పాటు సుమిత్ర, సౌజన్య, శారద, సరోజమ్మ, ఇంద్రావతి, రాజేశ్వరి, లీలా, రాధ తదితరులు సహకరించారు.



సీమంతం నిర్వహిస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యులు

పాత ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన

డోన్ టౌన్: పట్టణంలోని పాతపేటలో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ మహమ్మద్ హనీఫ్‌లతో కలిసి పాత భవనాలను పరిశీలించి వినియోగంలోకి తీసుకురావడానికి మార్గాలను చర్చించారు. అర్బన్ హెల్త్ సెంటర్, రైతు బజార్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం కింద అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.



పంట కాదు.. గుర్రపుడెక్క..!

కోవెలకుంట్ల పట్టణ శివారులో ప్రవహిస్తున్న కుందూనది పంట సాగును తలపిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకు వచ్చిన గుర్రపు డెక్క నది ప్రవాహం తక్కువ ఉన్న ఒక వైపుకు చేరింది. నదిలో గుర్రపు డెక్క మొక్కలు కనుచూపు మేరలో కన్పిస్తుండడంతో పొలాల్లో సాగు చేసి ఏపుగా పెరిగిన పైరులా కనిపిస్తోంది. అటుగా వెళుతున్న ప్రయాణికులకు నది పొడువునా ఉన్న గుర్రపు డెక్క కనువిందు చేస్తోంది.

– కోవెలకుంట్ల

వినాయక నిమజ్జన ప్రాంతాల పరిశీలన

కోవెలకుంట్ల: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీ పలు ప్రాంతాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటును దృష్టిలో ఉంచుకుని పోలీస్, రెవెన్యూ అధికారులు గురువారం వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి, కోవెలకుంట్ల, రేవనూరు ఎస్‌ఐలు మల్లికార్జున రెడ్డి, అనిల్‌కుమార్, భూపాలు డు, మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రకాష్‌నాయు డు పట్టణ శివారులోని కుందూనది వద్ద విగ్రహాల ను నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. భారీ వర్షాలకు తోడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి కుందూనదికి భారీగా నీటిని విడుదల చేశారు. వరదనీటితో కుందూ ఉధృతంగా ప్రవహిస్తోంది. పండుగ సందర్భంగా కోవెలకుంట్ల మండలంలోని ఆయా గ్రామాల్లో కొలువుంచిన వినాయక విగ్రహాలను మూడు, ఐదో రోజున కుందూనదిలో నిమజ్జనం చేయనుండడంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.



కుందూనది వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం రెవెన్యూ, విద్యుత్, పంచాయతీ అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి చలానా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక యాప్‌లో వివరాలు పొందుపరిస్తే పరిశీలించి పోలీసులు విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇస్తారన్నారు. డీజేల ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, అనిల్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ అనంతరావు, ఈఓ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

డీజేలు వాడొద్దు

సంజామల: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సీఐ హనుమంతు నాయక్ అన్నారు. సంజామల పోలీస్ స్టేషన్‌లో గురువారం గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశమయ్యారు. నిమజ్జన సమయంలో డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. నిమజ్జనానికి విగ్రహాలను తరలించే సమయంలో ఎలాంటి ఘటనలు జరిగినా ఆ బాధ్యతను కమిటీ సభ్యులే బాధ్యత వహించాలని తెలిపారు. ఎస్‌ఐ రమణయ్య పాల్గొన్నారు.

వైద్య రంగంలో ఉన్నతంగా రాణించాలి

అవుకు(కొలిమిగుండ్ల): వైద్యరంగంలో ఉన్నతంగా రాణించి రానున్న తరానికి మార్గదర్శకంగా నిలవాలని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వరరెడ్డి ఆకాంక్షించారు. అవుకు పట్టణానికి చెందిన కుమ్మిత సంజీవరెడ్డి కుమార్తె లక్ష్మీ కీర్తనదేవి పీజీ ప్రవేశ పరీక్షలో ఆలిండియాలో 1185 సాధించిన విషయం తెలిసిందే. గురువారం అవుకులోని చల్లా కార్యాలయంలో విద్యార్థినిని శాలువా కప్పి మెడల్‌తో ఘనంగా సత్కరించారు. చల్లా మాట్లాడుతూ.. వైద్య రంగంలో మరింతగా రాణించాలని విద్యార్థినికి ఆశీస్సులు అందజేశారు. విద్యార్థులు కష్టపడితే ర్యాంకులు వస్తాయనేందుకు అమ్మాయి సాధించిన ర్యాంకు నిదర్శనమన్నారు. చల్లాకు విద్యార్థిని తల్లి దండ్రులు ధన్యవాదాలు తెలిపారు.



ర్యాంక్ సాధించిన విద్యార్థినికి మెడల్ అందిస్తున్న చల్లా విఘ్నేశ్వరరెడ్డి

అంగన్‌వాడీల ఆందోళన





డోన్: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు, బనగానపల్లెలో..

డోన్, బనగానపల్లె వ్యాప్తంగా గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పని భారం మాత్రమే పెంచి వేతనాలు పెంచకపోవడాన్ని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాల పెంపుపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. –సాక్షి నెట్‌వర్క్





కొలిమిగుండ్ల: తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, కోవెలకుంట్లలో..